తేజో తన్మయికి పలువురి అభినందనలు

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడు మండలంలో పదో తరగతి పరీక్షలలో 570 మందికి 384 మంది ఉత్తీర్ణత సాధించారు. మండలంలో మొదటి స్థానం అక్షయ స్కూల్ విద్యాలయానికి సంబంధించి వెలగా తేజో తన్మయి 585 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. మండలంలో మొదటి ర్యాంకు సాధించిన తేజో తన్మయికి అక్షయ విద్యాలయం కరస్పాండెంట్ శ్రీవల్లి, ఫౌండర్ వీర రాఘవయ్య చౌదరి, తోటి విద్యార్థులు పలువురు అభినందనలు తెలిపారు.

ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర-పెదనందిపాడు : మండల పరిధిలోని వరగానిలో గ్రామ పార్టీ అధ్యక్షుడు చెన్నుపాటి సురేంద్ర ఆధ్వర్యంలో నందమూరి తారక రామారావు విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. కోఆర్డినేటర్ మాకినేని పెద్దరత్తయ్య, ఎస్ఆర్ఐ టీడీపీ ఆళ్ల వెంకట సుబ్బారావు, శివరామ కృష్ణయ్య, శివరాం ప్రసాద్, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

మండలంలో భారీ వర్షం

విశాలాంధ్ర-కాకుమాను : మండలంలో భారీ వర్షం కురవడంతో చెట్లు విరిగిపడి విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. నాలుగు రోజులుగా మండలంలో అత్యధిక వర్షం నమోదు కావడంతో పంట పొలాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వేసవిలో సైతం వర్షాలు పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా వేసవిలో కుంభవృష్టిగా వర్షాలు కురుస్తున్నాయి. రైతులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

మొక్కజొన్న పంట కొనుగోలు చేస్తాం

విశాలాంధ్ర-కాకుమాను : కొనుగోలు కేంద్రాల ద్వారా మొక్కజొన్నను కొనుగోలు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్.వెంకటేశ్వర్లు తెలిపారు. కాకుమాను, వేటూరు, అప్పాపురం పలు గ్రామాలలో తడిసిన మొక్కజొన్న పంటను ఆయన పరిశీలించారు. రైతులతో మాట్లాడి నష్టపరిహార వివరాలు తెలుసుకొని ప్రభుత్వం ఆదుకుంటుందని ఆయన రైతులకు భరోసా ఇచ్చారు.

రైతులను ఆదుకోవాల్సిందే

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందజేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ మాకినేని పెద్ద రత్తయ్య కోరారు. లేమల్లెపాడు, వట్టి చెరుకూరు గ్రామాలలో పర్యటించి రైతు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు అందజేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా శాంతిహోమం

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : ఆర్య సమాజ మందిరం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్య సమాజ ప్రచారకులు ఎం.కృష్ణమూర్తి ముట్లూరు గ్రామ ఆర్య సమాజం కార్యకర్తలు శాంతిహోమం నిర్వహించారు. ఆర్య సమాజం వ్యవస్థాపకులు ఉయ్యూరు వెంకటరామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు

విశాలాంధ్ర-వట్టిచెరుకూరు : ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలకు మండలంలోని కొండవాగులు, జల్లి వాగులు, మురుగుపారుదుల కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముట్లూరు సమీపంలోని కొల్లి మరల అండర్ టేనల్ నీటి ప్రవాహం సాధారణ ప్రవాహం దాటి ప్రవహిస్తుంది. పంట పొలాల్లోని బోదకాలు పంట కాలవలు అప్పాపురం ప్రధాన వాహిని గుంటూరు వాహిని సైతం కట్టల అంచుల వరకు వరద నీరు ప్రవహిస్తుంది.

1వ తేదీనే పెన్షన్ జమ చేయాలి

విశాలాంధ్ర-తెనాలి : ఆంధ్రప్రదేశ్‌లో 40యేళ్లు అన్ని సంస్థలలో పనిచేసి అనేక సేవలు అందించిన పెన్షనర్లకు ఇప్పటికీ పెన్షన్ జమ కాకపోవడం దురదృష్టకరమని, స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అనేక మంది వయోభారం, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని ఆదివారం పెన్షనర్స్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పిల్లలు చూడక, అనారోగ్యం, ఇంటి అద్దెలు, నిత్యావసర వస్తువులు, మందులు కోసం పెన్షన్ ఆధారమని తెలిపారు. పెన్షన్ సమాచారం కోసం ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారని, పూర్తి నిరాశతో వున్నారని చెప్పారు. కనుక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫైనాన్స్ కార్యదర్శి కనికరించి పెన్షనర్స్‌కు ప్రతినెలా 1వ తేదీన పెన్షన జమ అయ్యేటట్లు చూడాలని ఆయన కోరారు.

విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడాలి

విశాలాంధ్ర-ప్రత్తిపాడు : పదవ తరగతి పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రత్తిపాడు అక్షయ విద్యాలయం విద్యార్థులను శాసనసభ్యుల కార్యాలయంలో మాజీ మంత్రి మేకతోటి సుచరిత అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. భవిష్యత్తులో బాగా చదివి మరెన్నో విజయాలు సాధించి ఉన్నతమైన స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. అక్షయ స్కూల్ ఛైర్మన్ వెలగా రాఘవయ్య చౌదరి, డైరెక్టర్ వెలగా శ్రీవల్లి శివం, యువర్ మిషన్ ఛైర్మన్ ఉప్పల రఘుబాబు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-తాడేపల్లి : ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు రైతులు అల్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందరరావుయాదవ్ వ్యాఖ్యానించారు. ఆదివారం తాడేపల్లిలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు పంట చేతికి అందే దశలో వర్షానికి పంట దెబ్బతినడం వల్ల మొక్కజొన్న, పసుపు, మిర్చి కల్లాల్లో ఆరబెట్టిన పంట భారీ వర్షాలకు తడిచి పోవడం, కొట్టుకుపోవడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.90 వేల నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బుర్రముక్కు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముువ్వ చినబాపిరెడ్డి ట్రస్ట్ సాహిత్య, సామాజిక సేవలు అభినందనీయం

విశాలాంధ్ర-గుంటూరు : పేద ప్రతిభావంతులైన విద్యార్థులను ఆర్థిక ప్రోత్సాహం ఇచ్చి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడంతోపాటు రెండు దశాబ్దాలకుపైగా సాహిత్య కార్యక్రమాల ద్వారా విలువలతో కూడిన సమాజం కోసం కృషి చేస్తున్న ముువ్వా చిన బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు సేవలు అభినందనీయమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. స్థానిక పెదపరిమి ముువ్వా చిన్న బాపిరెడ్డి మెమోరియల్ ట్రస్టు భవనం వృద్ధాలయంలో 'సహస్ర కథా స్రవంతి' వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ట్రస్ట్ ఛైర్మన్ ఎంవీ రామిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ వెయ్యి రోజులకు పైగా ప్రతి రోజు వేకువజామనే వాట్సప్ కథనం జనరంజకంగా సాహితీ పిపాసుల ఆకలి తీర్చే విధంగా ప్రసారం చేయటం అరుదైన సాహితీ సేవగా అభివర్ణించారు. సాహిత్యంలో కథ, కథనం, అందులోని పాత్రలు, సంభాషణలు, మెరుగైన సమాజానికి విలువలను పంచే విధంగా తీర్చిదిద్దటం ముదావహమన్నారు. వర్తమాన సమాజానికి సాహిత్యం పట్ల ఆసక్తి, ప్రేమ అలవడడం ద్వారా ఉన్నతమైన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడుతుందని చెప్పారు. ఉమ్మడి కుటుంబాల వ్యవస్థలో పెద్దల నుంచి మనుమలు, మనుమరాండ్రు కథలు వినటం ద్వారా విలువలతో కూడిన సమాజం శతాబ్దాల పాటు వెలుగొందిందన్నారు. ప్రముఖ నాటక రంగ రచయిత వల్లూరు శివప్రసాద్ మాట్లాడుతూ అంతర్జాలాల ద్వారా వికృతాలు సమాజాన్ని ముంచేత్తుతున్న నేపథ్యంలో కథా స్రవంతులు సమాజానికి దారి దివిటీల వంటివన్నారు. అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో వెలువరించిన కథా స్రవంతి పుస్తకాలు లక్షకు పైగా దేశ విదేశాలలో పాఠకులకు అందించామన్నారు. ఈ సందర్భంగా కథా స్రవంతి నిర్వాహకులు ములగాడ సురేష్ కుమార్, స్వర ప్రదాత పప్పు జోగారావు, సాంకేతిక సహకారం అందించిన పప్పు వరుణ్, దాసరి రవళిలను ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ప్రతి కథా రచయితకు కథల పుస్తకాల సంచులను, జ్ఞాపికలను బహుకరించారు. నరసింహారెడ్డి, వంగా సాంబిరెడ్డి, ముువ్వ సాంబిరెడ్డి పాల్గొన్నారు.

లోటస్ హైస్కూల్ విద్యార్థుల విజయకేతనం

విశాలాంధ్ర-గుంటూరు : పదవ తరగతి పరీక్షా ఫలితాలలో స్థానిక కృష్ణనగర్ లోటస్ హైస్కూల్ విద్యార్థులు 95 శాతం ఫలితాలతో విజయకేతనం ఎగురవేశారని డైరెక్టర్ పరుచూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం పాఠశాలలో విజేతలను అభినందించారు. ఆయన మాట్లాడుతూ హాజరైన 30 మంది విద్యార్థులలో 15 మంది 500 పైగా మార్కులు సాధించారని, షేక్ ఆర్సియా నవీన్ 588 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా అక్షయ రాణి, లోకేశ్వర్, వెంకట్, హిమబిందు 550 పైగా మార్కులు సాధించి పాఠశాల కీర్తి ప్రతిష్టలు ఇనుమడింపచేశారని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.ఝాన్సీ రాణి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

'సెయింట్ లారెల్స్' విజయ ప్రభంజనం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: స్థానిక ఆర్టీసీ కాలనీలోని సెయింట్ లారెల్స్ స్కూల్ విద్యార్థులు పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 92 శాతం ఉత్తీర్ణత సాధించి తమ ప్రతిభను చాటుకున్నారని ఆ స్కూల్ కరస్పాండెంట్ మేకల రవీంద్ర తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల్లో 550 మార్కులు పైగా 18 మంది విద్యార్థులు, 500 మార్కులకు పైగా 20 మంది విద్యార్థులు, విజయం సాధించారు. 582 మార్కులతో వల్లెపు లోకేష్ మొదటి స్థానం, 578 మార్కులతో పి వీణ మాధురి, వీరన్, తరుణి ద్వితీయ స్థానంలో కోడూరు మధురమ లక్ష్మి తృతీయ స్థానంలో నిలిచారు. కరస్పాండెంట్ రవీంద్రబాబు, డైరెక్టర్ మేకల శేషకుమారి మాట్లాడుతూ ప్రణాళిక బద్ధమైన విద్యా బోధన ద్వారానే ఇటువంటి ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. స్కూల్ సిబ్బంది కళ్యాణి, జయశ్రీ, ఫాతిమా, మోహన్, శ్రీకర్ తదితరులు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు.

'నవీన్ స్కూల్' విద్యార్థుల ప్రభంజనం

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో నవీన్ స్కూల్ విద్యార్థులు విజయ ప్రభంజనం సృష్టించారని స్కూల్ డైరెక్టర్ వి.చిన్నప్ప రెడ్డి, కరస్పాండెంట్ ఎం.చిన్నమ్మ తెలిపారు. స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కే దర్శిని 586, బి కమలి 586, జి.మిధిలేష్ 585, ఏ మోహిత్ రెడ్డి 584, డి నితిన్ నాయక్ 580 మార్కులు సాధించారని తెలిపారు. మొత్తం మీద 97శాతం పాస్ పర్సంటేజీతో విజయ కేతనం ఎగరవేశారని తెలిపారు. విద్యార్థులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ వీ నవీన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ పాలనపై ప్రజావ్యతిరేకత

విశాలాంధ్ర-గుంటూరు : వైసీపీ నాలుగేళ్ళ పాలనలో ప్రజల జీవన విధానం చిన్నాభిన్నం అయ్యిందని, నగర ప్రజలు సమస్యల సుడిగుండంలో చిక్కుకొని నరకయాతన పడుతున్నారని జనసేన పార్టీ గుంటూరు అర్బన్ జిల్లా అధ్యక్షుడు నేరేళ్ళ సురేష్ ఆవేదన వ్యక్తం చేశారు. జనసేన పార్టీ ఆదేశాల మేరకు సమస్యలపై జనసేన సమరభేరి కార్యక్రమాన్ని ఆదివారం పాతగుంటూరు మణిహోటల్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన నేతలు బాలాజీ నగర్ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల వద్దకు వెళ్లి వాళ్ళు ఎదురుకుంటున్న సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా యువత గంజాయి సేవించి పగలు అర్ధరాత్రి అని తేడా లేకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మినహా మిగతా సమయంలో తమ ప్రాంతాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస మౌలిక సదుపాయాల కల్పనలో స్థానిక నేతలు పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ఈ సందర్భంగా నేరేళ్ళ సురేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా సుమారు తొమ్మిది సంవత్సరాలుగా పదవిలో ఉన్న తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి జాడే లేకపోవడం ముస్తఫా పనితీరుకి నిదర్శనమని విమర్శించారు. రాష్ట్ర కార్యదర్శి వడ్రానం మార్కండేయ బాబు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజలెవ్వరూ సంతోషంగా లేరని ధ్వజమెత్తారు. స్థానిక ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయబ్ కమాల్, దాసరి లక్ష్మీ దుర్గ, ఎర్రంశెట్టి పద్మావతి, మాధాసు శేఖర్, చింతా రేణుక రాజు, ఎడ్ల నాగమల్లేశ్వరరావు, సూరిశెట్టి ఉపేంద్ర, ఆళ్ళ హరి, పాకనాటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకుంటాం

విశాలాంధ్ర-తాడికొండ : అకాల వర్షాల వల్ల పంట నష్టపోయిన మిర్చి రైతులను ఆదుకుంటామని వైసీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ రైతులకు హామీ ఇచ్చారు. రావెల గ్రామ మిర్చి పొలాలను ఆదివారం పరిశీలించారు. కల్లాలపై కలియతిరిగారు. మిర్చి రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వంతో మాట్లాడతానని అన్నారు. హార్టికల్చర్ ద్వారా రైతులకు టార్పాలిన్ పట్టాలను ఇప్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం రావెల మందపాడు ప్రధాన రహదారి మధ్య ఉన్న కలవర్టును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ఆళ్ల శ్రీనివాసరెడ్డి, కొమ్మినేని రామచంద్ర రావు, దేవరపల్లి పాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఆర్ నగర్ ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలి

విశాలాంధ్ర-గుంటూరు : చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) నగర ప్రధాన రహదారి నిర్మాణం చేపట్టాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. స్థానిక సీఆర్ నగర్‌లో శాఖ కార్యదర్శుల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన కోట మాల్యాద్రి మాట్లాడుతూ దశాబ్ధాలుగా పేద, మధ్యతరగతి ప్రజలు నివాసం ఉంటున్న సీఆర్ నగర్‌లో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు నగరపాలక సంస్థ నూతన పాలకవర్గం కృషి చేయాలని కోరారు. అదేవిధంగా సైడ్ రోడ్లు, కాలువల పనులను ప్రారంభించి ప్రజలను అసౌకర్యం నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీపీఐ నగర కమిటీ సభ్యులు ఎస్.దేవనాయక్, చల్లా మరియదాసు, నూతలపాటి వెంకటేశ్వరరావు, బుజ్జి, బోసు, మస్తాన్, శీను తదితరులు పాల్గొన్నారు.

మహోజ్వల శక్తి అల్లూరి సీతారామరాజు

ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ నాయకుల నివాళి

విశాలాంధ్ర-గుంటూరు : భారత స్వాతంత్ర్య చరిత్రలో అల్లూరి సీతారామరాజు ఒక మహోజ్వల శక్తి అని ఏఐ వైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కే వలి అన్నారు. తెలుగు వారి పౌరుష ప్రతీక, విప్లవ వీరుడు, 27 సంవత్సరాల యుక్త వయస్సులోనే దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సంద ర్భంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక నాజ్‌సెంటర్‌లో ఉన్న అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వలి మాట్లాడుతూ అల్లూరి జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని అన్నారు. సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్రం వస్తుందని నమ్మి, దాని కోసమే తన ప్రాణాలర్పించిన యోధుడు అల్లూరి అని కొనియాడారు. 27 ఏళ్ళ వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీష పరాయి పాలకులను ఢీకొన్నారని గుర్తుచేశారు. నేటి విద్యార్థులు, యువత, రేపటి భావిభారత పౌరులకు దేశం కోసం ప్రాణాలు అర్పించిన అనేక మంది విప్లవ వీరులు, అనేక త్యాగాలు చేసిన మహోన్నత వ్యక్తులు, మేధావుల చరిత గురించి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బందెల నాసర్ జీ, ఏఐవైఎఫ్ నగర కార్యదర్శి చల్లా మరియదాసు, జాని, అప్పాజీ, అల్లాభక్షు, పరమ్ తదితరులు పాల్గొన్నారు.

పెదకాకానిలో మైనారిటీ మహాసభ

విశాలాంధ్ర-పెదకాకాని : పొన్నూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆదేశాల మేరకు పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం పెదకాకాని మండల తెలుగుదేశం పార్టీ అనుబంధ మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ భాషా వలి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంకు పార్టీ మైనారిటీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మొహమ్మద్ మోసిన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ దుల్హన్ పథకం ద్వారా మైనారిటీలకు జరిగిన తీవ్ర అన్యాయంపై, షరతులు లేని దూల్హన్ పథకం అమలు చేయటం కోసం ఉద్యమించటం గురించి.. ముస్లిం మైనారిటి ఉమ్మడి కుటుంబాలను ప్రత్యేకంగా గుర్తించి కరెంట్ మీటర్లు షరుతులు లేకుండా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేటట్లు ప్రభుత్వంపై ఉద్యమం చేయుట గురించి తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో జిల్లా మైనారిటీ సెల్ అధికార ప్రతినిధి షేక్ అల్లావుద్దీన్, నియోజకవర్గ మైనారిటీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి షేక్ షాబిర్, షేక్ పెద జాన్, మండల ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసీం, ఉపాధ్యక్షులు షేక్ భాషిర్, కార్యదర్శి షేక్ జిలాని, కార్యదర్శి షేక్ అసిఫ్, మైనారిటీ సెల్ నాయకులు షేక్ మజాహార్, షేక్ సుభాని, షేక్ మొగ్గల్, బాజీ, మహబూబ్ అలీ, షేక్ రషీద్, షేక్ అప్సర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా క్రికెట్ పోటీలు

విశాలాంధ్ర-తాడేపల్లి : పెనుమాక గ్రామంలోని జూనియర్ ప్రభుత్వ కళాశాలలో కళ్ళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ఉత్కంఠ భరితంగా సాగుతున్నాయి. టోర్నమెంట్‌లో మొత్తం 64 టీమ్‌లు పాల్గొనగా రెండవ రౌండ్‌కు 32 టీమ్‌లు చేరుకున్నాయి. రెండవ రౌండ్ ముగియడంతో 16 టీమ్‌లు 3వ రౌండ్‌కు చేరుకోవడంతో నిర్వాహకులు డ్రా ద్వారా టీమ్‌ల మధ్య మ్యాచ్‌లు నిర్ణయించారు. ఈ మ్యాచ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన లింక్లాన్ దారకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కళ్ళం మహేష్ రెడ్డి అందజేసారు. 3వ రౌండ్ మ్యాచ్‌లు ముగియగానే సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లు మొదలవుతాయని కళ్ళం ఫౌండేషన్ ప్రతినిధులు తెలియజేశారు. ఈ సందర్భంగా టోర్నమెంట్ నిర్వాహకులు కళ్ళం గోవింద రెడ్డి మాట్లాడుతూ క్రికెట్ పోటీలు చాలా ఉత్సాహభరితంగా సాగుతున్నాయని, యువకుల్లోని ఉన్న ప్రతిభను వెలికితీయడానికి క్రీడలు దోహదపడతాయని ఈ క్రికెట్ పోటీల ద్వారా ఉత్తమ ప్రతిభ కనబరిచే క్రీడాకారులను గుర్తించడమే ఈ పోటీల ముఖ్య ఉద్దేశమని అన్నారు.

విశాలాంధ్ర గుంటూరు జిల్లా

ఆటో కార్మిక సంఘం మహాసభ

విశాలాంధ్ర-పెదకాకాని : మండల కేంద్రమైన పెదకాకాని, వెనిగండ్ల ఏఐటీయూసీ ఆటో కార్మిక సంఘం మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన గుంటూరు జిల్లా ఆటో కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆటో కార్మికులందరూ ఐక్యమత్యంతో ఉంటూ కాకి చొక్కా వేసుకుని లైసెన్సు, పర్మిట్, సి బుక్కులతో పాటు ఇన్సూరెన్స్ కూడా చేసి ఉండాలని అన్నారు. ప్రయాణికులు దేవుళ్ళతో సమానమని వారు ఏమైనా వస్తువులు మరిచిపోయినప్పుడు, ఎవరైనా అసాంఘిక శక్తులు అసాంఘిక కార్యక్రమాలు జరుపుతుంటే వెంటనే వారి ఆచూకీ పోలీసు వారికి తెలియజేయాలని అన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా దుర్గం కోటేశ్వరరావు, అధ్యక్షులుగా గజ్జల శ్రీనివాసరావు, కార్యదర్శిగా బొందలపాటి దేవదాసు, ఉపాధ్యక్షులుగా నౌడు సత్యనారాయణ, సహాయ కార్యదర్శిగా బుల్ల సురేష్, కోశాధికారిగా షేక్ బుడే, ఆఫీస్ బేరర్స్‌గా పాశం దర్గాబాబు, షేక్ వలి, ఏ.ఆంజనేయులు, ఏ.శ్రీనివాసరావు, కె.నాగరాజు, బి.దేవసహాయం, ఆనందరావులను ఎన్నుకోవడం జరిగింది.

పెత్తందార్లపై కార్మిక తిరుగుబాటే మేడే

విశాలాంధ్ర-మంగళగిరి : ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా పాత మంగళగిరిలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరపతయ్య పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుల కష్టాన్ని దోచుకునే పెత్తందార్లపై ప్రపంచంలో ఉన్న కార్మికులంతా ఏకమై పెత్తందారి వ్యవస్థపై తిరుగుబాటు చేసి విజయం సాధించి జరుపుకునే కార్మికుల పండుగ మేడే అన్నారు. ఈ కార్యక్రమంలో పిల్లలమర్రి నాగేశ్వరరావు, దోనేపూడి సూరిబాబు, రెడ్డి, మల్లూరి వాసు, పల్లా వెంకటేశ్వరరావు, ఆకురాతి వీరస్వామి, మాచర్ల వెంకటరమణ, దోనేపూడి బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారాన్ని అందించాలి

విశాలాంధ్ర-మేడికొండూరు : రాష్ట్రంలో అకాల వర్షాలతో రైతుల ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిన్నదని, వరదలు, తెగుళ్ల వలన నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారాన్ని తక్షణమే అందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యాలయ ఇంఛార్జి వైవీ సుబ్బారావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత కొన్ని రోజులుగా అకాల వర్షాలతో జరిగిన అపార నష్టంపై సత్వర చర్యలు తీసుకోవాలని, రైతులు మద్దతు ధర లభించక నష్టపోతున్నారని, కొంతమంది రైతులు ఈ-క్రాప్‌లో నమోదు కానందున తమ ధాన్యం అమ్ముకునేందుకు ఇబ్బందులు పడుతున్నారని, కొన్ని జిల్లాలో దెబ్బతిన్న, రంగుమారిన ధాన్యం ఎక్కువగా ఉన్నందున, రైతులు తమ పంట విలువను నష్టపోకుండా, కొనుగోలు నిబంధనల్లో సడలింపులు చేయాలని, రైతుల వద్ద నుంచి పూర్తిగా ధాన్యం కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి విపత్కర పరిస్థితులలో ప్రభుత్వం వెంటనే స్పందించి కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే తేమశాతం నిబంధనలు సడలించి వీలైనంత త్వరగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లను చేపట్టాలని కోరారు.

నగరంలో 'ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెడ్ రీ-ప్రొడక్షన్ ట్రావెలింగ్ సెమినార్'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని హోటల్ క్యాపిటల్‌లో గుంటూరు ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ ఆధ్వర్యంలో 'ఇండియన్ సొసైటీ ఆఫ్ అసిస్టెడ్ రీ-ప్రొడక్షన్ (ఐఎస్ఏఆర్)ట్రావెలింగ్ సెమినార్' ఆదివారం జరిగింది. ఈ సెమినార్‌కు ముంబై డాక్టర్ కేదార్ గన్ల ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కేదార్ ప్రొజెస్టెరాన్ హార్మోన్ ఉపయోగాలు.. దీనిని గర్భిణీ స్త్రీలు ఎలా వాడాలి.. ఎందుకు వాడాలి తదితర విషయాలు గురించి కూలంకుషంగా వివరించారు. అదేవిధంగా ఐయూఐలో ఇప్పుడున్న లేటెస్ట్ అడ్వాన్స్‌డ్ సదుపాయాలు గురించి కూడా తెలియజేశారు. అలాగే ఐయూఐ చేసిన తరువాత, చేయకముందు గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఆహార నియామాలు గురించి...ఇసార్ (ఐఎస్ఏఆర్)మార్గదర్శకాలు గురించి సవివరంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ వెంకటేశ్వరరావు, సెక్రటరీ డాక్టర్ శనక్కాయల ఉమా శంకర్, డాక్టర్ వి.పద్మజ పాల్గొని ప్రసంగించారు.

రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి

విశాలాంధ్ర-గుంటూరు : లక్ష్మీపురంలో రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నేషనల్ వైస్ ఛైర్మన్ జమీల్ అహ్మద్ బేగ్ రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నోబెల్ బహుమతిని అందుకున్న మొట్టమొదటి ఆసియావాసి రవీంద్రనాథ్ ఠాగూర్ అని, ఆయన రచనలలో గీతాంజలి చాలా గొప్పదని అన్నారు. రవీంద్రుడు కేవలం రచయితగానే ఉండపోక, బాలల హృదయాలను వికసింపచేయటానికై ప్రాచీన మునుల గురుకులాల తరహాలోనే శాంతినికేతన్‌గా ప్రసిద్ధి గాంచిన విశ్వభారతి విశ్వవిద్యాలయాన్ని స్థాపించాడని చెప్పారు. అది ఐదుగురు విద్యార్థులతో ప్రారంభమై క్రమంగా విస్తరించిందన్నారు. ఆరోగ్యం కాపాడుకోవటం, పరిశుభ్రత, సత్యాన్నే పలుకుట, కాలినడక, పెద్దలను, గురువులను గౌరవించటం వారికి నేర్పేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో దుర్గా, శ్రీనివాస్, అమరేష్, ఆశ్రిత్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన ప్రస్తుతం గుంటూరు సిటీ, పాత గుంటూరు, యాదవబజారు కాపురస్తులు **స్వయంపు శ్రీనివాసరావు, S/o.** కొండయ్య గారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునదేమనగా,

నా క్లయింటు **దీ: 29-04-2023**న ప్రకాశం డి., సంతనూతలపాడు సబ్.డి., పేర్నమిట్ట గ్రామ సర్వే నెం: 508/14 లో య.0-25సెంట్లున్నూ, సర్వే నెం: 508/13 లో య.0-07 సెంట్లున్నూ వెరశి 2 నెంబర్లు తాలూకు ఏక ప్రదేశంగా ఉన్న య.0-32సెంట్లు ఆస్తి యొక్క ఒరిజినల్ దస్తావేజు నెం: **1725/2009** యస్.ఆర్. ఓ. సంతనూతలపాడు యొక్క లింకు దస్తావేజులైనటువంటి **208/2004, 365/2004, 1444/2004 & 852/2007** యస్. ఆర్. ఓ. సంతనూతలపాడు, మరియు మరికొన్ని డాక్యుమెంట్లును తీసుకొని అరండల్ పేట పని నిమిత్తము వెళ్ళుచూ అరండల్ పేటలో జిరాక్స్ తీసుకొనుటకు చూసు కొనగా పై తెలిపిన ఒరిజినల్ లింకు దస్తావేజులు కనిపించలేదు. ఆ చుట్టుపక్కల ఎంత వెతికినా దొరకలేదు. కావున సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది అడ్రస్ నందు అందజేసిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును. అట్లు కాక సదరు దస్తావేజులను ఉపయోగించి ఏవిధమైన అన్యాక్రాంత ములు జరిపిన నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులు కాగలరు.

చెరుకూరి శ్రీనివాసరావు, అడ్వకేట్, గుంటూరు, సెల్: 9963638490

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో 'అల్లూరి' వర్ధంతి

విశాలాంధ్ర-పొన్నూరు : రవి హస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు అని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో పొన్నూరులో ఏర్పాటు చేసిన అల్లూరి వర్ధంతి సభలో ఆయన మాట్లాడుతూ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా మన్యం ప్రజలను పోరాటయోధులుగా తీర్చిదిద్ది విప్లవ మార్గాన నడిపిన ధీశాలి అని, మన దేశ స్వాతంత్రం కోసం బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా పోరాటం నడిపిన విప్లవ వీరులలో ప్రథమ స్థానంలో నిలిచిన వీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. సభకు మద్దుకూరి రవీంద్రబాబు అధ్యక్షత వహించగా ఆరేటి మాట్లాడుతూ దేశ స్వాతంత్రం కోసం పోరాటం నడిపిన వీరులందరిలో సీతారామరాజు అగ్రగన్యుడని అన్నారు. గంటం దొర, మల్లు దొర లాంటి ఎందరో వీరులను తయారు చేసినటువంటి మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు గెరిల్లా పోరాట యోధుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. స్వాతంత్రోద్యమంలో ఎలాంటి పాత్రలేని ఆర్ఎస్ఎస్, బీజేపీ నేడు దేశాన్ని పరిపాలిస్తున్నాయని ప్రజల కష్టంతో నిర్మించిన అనేక పరిశ్రమలను నేడు బీజేపీ ప్రభుత్వం ప్రైవేట్‌పరం చేస్తున్నదని వాటిని కాపాడుకోవడానికి నేటి యువత అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో పోరాటం చేయవలసిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాకారులు వై.త్యాగరాజు, ఎస్.శాంతి, వై.భవాని, ఎల్.అనిల్, వై.భవాని, డి.లతాశ్రీ, ఎం.కుమార్, వై.సాయి, డి.భవాని, సాయి తేజ, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ధైర్యంగా ఉండాలి: అధికారులు

విశాలాంధ్ర-చేబ్రోలు: రైతులు ధైర్యంగా ఉండాలని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. మండల పరిధిలోని గొడవర్రు గ్రామంలో ఇటీవల కురిసిన వర్షలతో దెబ్బతిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిసినమొక్కజొన్న, తెల్లజొన్న పంటలపై ఉప్పుచల్లటం వలన మొలకలను అదుపు చేయవచ్చని రైతులు ఈ పద్ధతి పాటించాలన్నారు. మొక్క జొన్న పంటను కొనుగోలు చేయుటకు కొనుగోలు కేంద్రం ప్రారంభించామని తెలిపారు. క్వింటాకు రూ,1962లు మద్దతు ధర ఉందన్నారు. రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేన్ చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ శ్రీనివాసనాయక్, ఉద్యాన వన శాకాధికారిణి ఉషా వీఏఏ శివ సత్యం బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుంది

విశాంలాంధ్ర-చేబ్రోలు: ప్రభుత్వం ప్రతి రైతుకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని గొడవర్రు, కొత్త రెడ్డి పాలెం గ్రామాల్లో తడిసిన మొక్కజొన్న, తెల్ల జొన్న, మిర్చి పంటలను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రైతు భరోసా కేంద్రాలల్లో పంట నష్టపోయిన రైతులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం: ఇంతియాజ్

విశాలాంధ్ర-గుంటూరు కార్పొరేషన్: జిల్లాలో పడ్డ అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులు అధైర్యపడవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు రైతులకు వివరించాలని జిల్లా ప్రత్యేక అధికారి, మైనారిటీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, అడిషనల్ సీసీఎల్ఏ, సెర్ప్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం మధ్యాహ్నం కలక్టరేట్ లోని వీసీ సమావేశ మందిరంలో పంట నష్టంపై సెర్ప్ సీఈవో ఇంతియాజ్ అహ్మద్, కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ రాజ కుమారితో కలసి సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు అకాల వర్షాల కారణంగా 3,185 హెక్టార్లలో మొక్కజొన్న, జొన్న పంటలకు, 16 హెక్టార్లలో వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేయడం జరిగిందని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ ప్రభుత్వం పంట నష్టానికి ఇన్పుట్ సబ్సిడీ అందిస్తుందన్నారు. జిల్లాలో 170 ఆర్బీకేల ద్వారా మొక్కజొన్న కొనుగోలు ఇప్పటికే ప్రారంభించడం జరిగిందన్నారు. వర్షం తగ్గిన తరువాత వాస్తవిక పంట నష్టం అంచనాను తయారు చేయడం జరుగుతుందని, ఆ మేరకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడం జరుగుతుందని వారికి వివరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది మే మాసంలో వంద మిల్లీ మీటర్ల వర్షం నమోదు అయిందని, కొన్ని మండలాలో 170 నుండి 175 మిల్లీ మీటర్ల వరకు వర్షాలు పడ్డాయని వివరించారు. జిల్లాలో అకాల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టం అంచనాలు తయారు చేసేందుకు టీములను సిద్ధపరచినట్లు వివరించారు. సమీక్షలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లలిత, జిల్లా ఉద్యాన శాఖాధికారిణి సుజాత, ఆర్ అండ్ బి పర్యవేక్షక ఇంజనీర్ నిర్మలా, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ జిల్లా మేనేజర్ లక్ష్మీ, మార్క్ ఫెడ్ జిల్లా మేనేజర్ కృష్ణరావు, పంచాయితీ రాజ్ ఎస్. ఈ గుర్రం బ్రహ్మయ్య, తదితర అధికారులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర పల్నాడు జిల్లా

విగ్రహప్రతిష్ఠ మహోత్సవంలో జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: మండలంలోని ఉమ్మడివరం గ్రామంలో శ్రీ అంకమ్మ తల్లి నూతన విగ్రహా ప్రతిష్ట మహోత్సవంలో పల్నాడు జిల్లా టిడిపి అధ్యక్షులు, వినుకొండ మాజీ శాసనసభ్యులు జీ.వి ఆంజనేయులు అమ్మ వారిని సందర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ మహోత్సవంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర-మాచవరం : మండల కేంద్రమైన మాచవరంలో పిడుగురాళ్ల సాయి బాలాజీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో రోగులకు, చిన్నారులను పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరావు, నవ్య చౌదరి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు వేగవంతం చేయండి

విశాలాంధ్ర-మాచవరం : మండలంలోని అన్ని గ్రామాలలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేయాలని ఏపీవో వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్ల సమావేశం నిర్వహించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. అధిక సంఖ్యలో కూలీలు పనులకు వచ్చేలా చూడాలని కోరారు.

మాచవరంలో కోతుల స్వైరవిహారం

విశాలాంధ్ర-మాచవరం : మండల కేంద్రమైన మాచవరంలో కోతులు స్వైరవిహారం చేస్తున్నాయి. మహిళలు, చిన్నారులు ఇండ్లలో నుంచి బయటకు రావాలంటే భయాందోళన చెందుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళిన పట్టించుకోవట్లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

సర్పంచ్‌గా వెంకాయమ్మ బాధ్యతలు

విశాలాంధ్ర-మాచవరం : మండలంలోని రేగులగడ్డ గ్రామ సర్పంచ్‌గా జక్కుల వెంకాయమ్మ కొండలు బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, నూతన సర్పంచ్ వెంకాయమ్మ గ్రామాభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

జిల్లా పరిషత్ పాఠశాలకు నిధులు మంజూరు

విశాలాంధ్ర-మాచవరం : మండలంలోని మొర్జంపాడు జిల్లా పరిషత్ పాఠశాలకు రూ.1.25 కోట్ల నిధులు మంజూరైనట్లు మాచవరం ఎంపీపీ దారం అమ్ములమ్మ లక్ష్మిరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నం పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి ప్రత్యేక నిధుల నుంచి పాఠశాల అభివృద్ధికి రూ.1.25 కోట్ల నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. ఈ మేరకు ఎంపీ బాలశౌరికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని గంటావారిపాలెం గ్రామంలో గ్రామ పెద్దల సహకారంతో టైగర్ సీసీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేది నుంచి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించనున్నట్లు కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. మొదటి బహుమతి మేకల హనుమంతరావు రూ.50 వేలు, రెండవ బహుమతి కుంభా ఏగియ్య రూ.30 వేలు, మూడవ బహుమతి మేకల రమేష్, సురేష్ రూ.20 వేలు, నాలుగవ బహుమతి పులి గోపి రూ.10 వేలు విజేతలకు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 7993097407, 7892632979 నంబర్లలో సంప్రదించాలన్నారు.

గ్రామ సింహాల స్వైర విహారం

విశాలాంధ్ర-నూజెండ్ల : మండలంలోని విఅప్పాపురం, జంగాలపల్లె, అయినవోలు, చింతలచెరువు, తలార్లపల్లె, నాగిరెడ్డి పల్లె తదితర గ్రామాలలో వీధి కుక్కల బెడద రోజురోజుకీ తీవ్ర రూపం దాల్చుతున్నాయి. శనివారం రాత్రి విఅప్పాపురం గ్రామంలో కుక్కలు దాడులు చేయడంతో పది మంది గాయాలు పాలై ఆసుపత్రులకు పరుగులు తీశారు. రహదారుల వెంట వెళ్లే ప్రజలు, మూగజీవులు పశువులపైకి కుక్కలు పరుగులు తీసి దాడులు చేస్తున్నాయి. ద్విచక్ర వాహనాలపై వెళ్లే వారి వెంట కుక్కలు వెంబడిస్తుండడంతో వారు ప్రమాదాలు బారిన పడుతున్నారు. రాత్రిపూట బయటకు రావాలంటే ప్రజలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఇంటి నుంచి బయటికి రాలేకపోతున్నారు. వీధి కుక్కల నియంత్రణకు వాటి నుంచి వచ్చే వ్యాధుల గురించి అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

విశాలాంధ్ర-రాజుపాలెం : పౌర గ్రంథాలయ శాఖ ఆంధ్రప్రదేశ్ అధీనంలో గల రాజుపాలెం శాఖ గ్రంథాలయంలో పాఠశాల విద్యార్థులకు ఈ నెల 8వ తేది నుంచి వచ్చే నెల 11వ తేది వరకు వేసవి విజ్ఞాన శిబిరము ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని శాఖ గ్రంథాలయ లైబ్రేరియన్ కేఎస్ఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేసవి శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనము, స్పోకెన్ ఇంగ్లీష్, పుస్తక సమీక్ష, చిత్ర లేఖనము వంటి సృజనాత్మక కార్యక్రమంలో ప్రతిరోజు నిర్వహిస్తారన్నారు. విద్యార్థులు వేసవి పుస్తక పఠనంపై ఆసక్తి పెంచుకోవడంతో పాటుగా సమయాన్ని వృధా చేయకుండా గ్రంథాలయాలను ఉపయోగించుకోవాలని కోరారు. పై అంశాలపై విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వడానికి ఆసక్తిగల ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గ్రంథాలయ అధికారిని సంప్రదించాలని కోరారు.

భారీ వర్షానికి కూలిన పూరి గుడిసె

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : మాచర్ల మండలం బ్రహ్మానందపురం తండాలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షం, ఈదురు గాలులకు పూరి గుడిసె కుప్ప కూలింది. ముడావత్ మంగ్తా నాయక్ బ్రహ్మానందపురం తండా సమీపంలో తన పొలంలోనే పూరి గుడిసె నిర్మించుకొని గత 10 ఏళ్లుగా నివాసం సాగిస్తున్నాడు. అకస్మాత్తుగా వర్షం, ఈదురుగాలుల ధాటికి పూరి గుడిసె కుప్పకూలింది. గుడిసెలో ఉన్న మంగ్తా నాయక్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. రెండు ఎద్దులకు కూడా స్వల్పంగా గాయాలు అయ్యాయి. పూరి గుడిసెలో ఫర్నిచర్ ధ్వంసం అయి సుమారు రూ.50 వేల ఆస్తి నష్టం వాటిల్లిందని మంగ్తా నాయక్ తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర-శావల్యాపురం: మండలంలోని ఇర్లపాడు గ్రామంలో శ్రీ సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ సీతారామచంద్ర స్వామి , ఉత్సవ బింబ జీవధ్వజ విమాన శిఖర గణపతి స్వామి వార్ల నూతన విగ్రహ ప్రతిష్ట మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేదపండితులు మూడు రోజులుగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో ప్రాణప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు పుణ్య దంపతులతో హోమాలు, ప్రత్యేక పూజలు చేయించారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మ నాయుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మక్కిన మల్లికార్జునరావులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

రైతులకు పంట నష్టపరిహారం ఇవ్వాలి

సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు

విశాలాంధ్ర-నరసరావుపేట: అకాల వర్షాల వల్ల పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నరసరావుపేట నియోజకవర్గంలో అకాల వర్షాలతో కల్లాల్లో తడిసిపోయిన ధాన్యం, మిర్చి, మొక్కజొన్న పంటలను సీపీఐ నాయకులు ఆదివారం పరిశీలించారు. అనంతరం కాసా రాంబాబు మాట్లాడుతూ రైతు ప్రభుత్వం అని చెప్పుకొనే వైసీపీ పాలకులు అకాల వర్షాలతో చేతికి వచ్చిన పంటలు తడిసిపోయి రైతులు తీవ్ర ఆందోళనలకు గురౌతున్న పట్టించుకోవడం లేదని, మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు రైతులను పరామర్శించిన దాఖలాలు లేవని అన్నారు. బంగళాఖాతంలో మరో తుఫాన్ ముంచుకొస్తుందన్న వార్తలతో రైతులు భయాందోళనకు గురౌతున్నారని వ్యవసాయ అధికారులు జిల్లాలో పంట నష్టాలను వెంటనే అంచనా వేసి ఎకరాకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేయాలని రాంబాబు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తడిసిన ధాన్యాన్ని, ఇతర వాణిజ్య పంటలను ప్రభుత్వం రైతుల నుంచి గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం వ్యవసాయ అధికారులు వెంటనే స్పందించకపోతే సీపీఐ పార్టీ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి వైదన వెంకట్, రైతులు ముసలయ్య, యాకోబు, బాబు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులు టీడీపీకి అండగా నిలవాలి

విశాలాంధ్ర-నరసరావుపేట: ఆర్యవైశ్యులకు వ్యాపార వర్గాలకు తెలుగుదేశం పార్టీ అండగా నిలిచిందని, ఆర్యవైశ్యులు టీడీపీకి అండగా నిలవాలని నరసరావుపేట టీడీపీ వాణిజ్య విభాగం అధ్యక్షుడు పల్లబోతు వరప్రసాద్ అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నియోజక వర్గం టీడీపీ ఇంచార్జి డాక్టర్ అరవిందబాబు సమక్షంలో వాణిజ్య విభాగం నూతన కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా వర ప్రసాద్, ఉపాధ్యక్షులుగా అనుమోలు శ్రీనివాస రావు, కోట ప్రభాకర్, మాజేటి పుల్లారావు, ప్రధాన కార్యదర్శిగా దేశ శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా తవ్వా ఏడుకొండలు, కార్యదర్శులుగా శ్రీనివాసరావు దిలీప్, కోట ప్రసాద్, ప్రభాకర్, పొట్టుమూర్తి అమర లింగేశ్వరరావు, ఆతుకూరి రామ కృష్ణ, చిలకల కామేశ్వరరావు, కొండపు వెంకట కోటేశ్వర రావు, తూనుగుంట్ల శ్రీనివాసరావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్‌గా చిలకల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా విభాగం అధ్యక్షులు వరప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యాపారస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వారి సమస్యల పరిష్కారానికి వాణిజ్యం విభాగం కృషి చేస్తుందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం వ్యాపారులను బెదిరించి ఇబ్బందులు పెడుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో ఆర్యవైశ్యులందరూ టీడీపీకి అండగా నిలుస్తారన్నారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ టీడీపీ ఆర్యవైశ్యులకు వ్యాపార వర్గాలకు అన్ని విధాల అండగా నిలుస్తుందని, తన వంత సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు. రాష్ట్ర వాణిజ్య విభాగం అధికార ప్రతినిధి అత్తలూరి సుబ్బారావు, కార్యదర్శి వనమా సంబశివరావు, మాజీ కౌన్సిలర్ గట్టుపల్లి సత్యనారాయణ, కొత్తూరి హనుమంతరావు, మాజేటి వెంకటేష్, కొత్తూరి సుబ్బరాయుడు, ఎస్.సూర్యనారాయణ, రెడ్డి హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్‌కు సన్మానం

విశాలాంధ్ర-రొంపిచర్ల : వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇటీవల నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన బత్తుల రామకృష్ణను ఆదివారం బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సన్మానం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ ఉపాధ్యక్షుడు సరికొండ తిమ్మరాజు మాట్లాడుతూ మార్కెట్ యార్డు ఏర్పాటు చేసిన తరువాత బీసీలకు చైర్మన్‌గా అవకాశం కల్పించటం హర్షణీయమని అన్నారు. గత ప్రభుత్వం కంటే ఈ ప్రభుత్వం బీసీలు రాజకీయపరంగా ఎదిగేందుకు కృషి చేస్తుందని అన్నారు. మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ బీసీల అభ్యున్నతి కోసం ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. బీసీ వర్గానికి చెందిన తనను యార్డ్ చైర్మన్‌గా నియమించటం, బీసీ సంక్షేమ సంఘం నాయకులు సన్మానించటం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. యార్డు చైర్మన్‌గా రైతులకు, ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్మన్ బత్తుల రామకృష్ణను బీసీ సంక్షేమ సంఘం నాయకులు దుశ్శాలువలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తన్నీరు శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ బొజ్జా శ్రీనివాసరావు, మాల మహానాడు జిల్లా నాయకులు దొప్పలపూడి దిబ్బయ్య, బీసీ సంక్షేమ సంఘం మండల నాయకులు ముక్కడాల వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకటేశ్వర్లు, బత్తుల మీరయ్య, ఒంటిపులి పేరయ్య, చక్రవరం సత్యనారాయణరాజు, బండారు వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-అమరావతి : మండలంలోని ఉంగుటూరు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ గుండవరపు వీరాంజనేయ స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవంలో ఆదివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, భక్తులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు ధాన్యం అమ్ముకోవద్దు

విశాలాంధ్ర-ముప్పాళ్ల : తడిచిన ధాన్యాన్ని తక్కువ ధరలకు రైతులు అమ్ముకోవద్దని ప్రభుత్వం జీడీసీఎంఎస్ ద్వారా కొనుగోలు చేస్తుందని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. మండలంలోని రుద్రవరం గ్రామంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు.

తడిచిన ధాన్యాన్ని తరలించడానికి రైతులకు లోడింగ్ చార్జీలు కూడా ఇస్తామని చెప్పారు. జేసీ వెంట జిల్లా వ్యవసాయ అధికారి మురళి, తహశీల్దార్ శంకర్, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు ఉన్నారు.

వైభవంగా శ్రీ లక్ష్మి అమ్మవారి తిరునాళ్ళ

విశాలాంధ్ర-ముప్పాళ్ళ : మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆదివారం నీలంపాటి శ్రీ లక్ష్మి అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పూజలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అన్నదాన కార్యక్రమం జరిగింది.

శ్రీ లక్ష్మి అమ్మవారికి మంత్రి పూజలు

విశాలాంధ్ర-ముప్పాళ్ళ : మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో ఆదివారం శ్రీ నీలంపాటి శ్రీ లక్ష్మి అమ్మవారికి రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబుకు గ్రామ ప్రజలు ఘన స్వాగతం పలికారు. భక్తుల కొంగుబంగారం అమ్మవారు ప్రజలకు సుఖసంతోషాలు ఇవ్వాలని మంత్రి అంబటి పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మూరూరి పద్మావతి రామలింగారెడ్డి, నిమ్మకాయల రాజనారాయణ తదితరులు ఉన్నారు.

అల్లూరి పోరాట స్ఫూర్తితో ముందుకు..

విశాలాంధ్ర-చిలకలూరిపేట : స్వాతంత్ర్య ఉద్యమంలో అల్లూరి సీతారామరాజు జరిపిన పోరాటం ఒక ప్రత్యేక అధ్యాయనం అని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు బి.శ్రీను నాయక్ అన్నారు. ఆదివారం సంఘ కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి దాని కోసమే తన ప్రాణాలర్పించిన మహా యోధుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శి కుంభా నాగేశ్వరరావు, గౌరవ అధ్యక్షులు బి.చిన్న నాయక్, కోశాధికారి బి.రాంబాబు నాయక్, జాతీయ బీజీయ సంక్షేమ సంఘం గౌరవ సలహాదారులు నాగేశ్వరరావు, దళిత నాయకులు సలీకినిడి నాగరాజు, చుండూరి ఆనంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-మాచవరం : తుఫాన్ ప్రభావంతో రానున్న రెండు రోజులు పాటు వర్షాలు పడే అవకాశం ఉండడంతో రైతులు అప్రమత్తంగా ఉండాలని మండల వ్యవసాయ అధికారి రామమ్మ సూచించారు.

ముగిసిన కళ్యాణ మహోత్సవాలు

విశాలాంధ్ర-యడ్లపాడు : సొలస గ్రామంలో వేంచేసి వున్న శ్రీ భూ సమేత రంగనాయక స్వామి కళ్యాణ మహోత్సవములు ఆదివారంతో ముగిశాయి. మే 5వ తేదీ నుంచి ప్రారంభమైన కళ్యాణ మహోత్సవములు ముగింపు రోజైన ఆదివారం పూలంగిసేవ, ద్వాదశ ప్రదక్షిణలు, స్వామివారి పవళింపు సేవతో ముగిశాయి. భక్తులు విశేషంగా పాల్గొని దర్శించి తరించారు. కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తలు అరవపల్లి మనోహర్, అరవపల్లి సాంబశివరావు, పలువురు భక్తులు సహకరించారు. భక్తులు కామేశ్వరి దేవి, వెంకట రాజరాజేశ్వరి దంపతులు, కేఎస్‌టీఎల్ మేఘన, ఎన్ఎస్ఎస్ ధీరజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మూడు రోజుల నుంచి గ్రామంలో భక్తులతో కోలాహలం నెలకొంది.

రూ.1.50 కోట్లతో అభివృద్ధి

విశాలాంధ్ర-మాచవరం : మండలంలోని చెన్నై పాలెం గ్రామంలో రూ.1.50 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు గురజాల శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి అన్నారు. ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం రెండో రోజు చెన్నై పాలెం గ్రామంలో నిర్వహించారు. గ్రామంలో రైతు భరోసా కేంద్రం, సచివాలయం కేంద్రాలు ప్రారంభించారు.

వైభవంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవం

విశాలాంధ్ర-రొంపిచర్ల: మండలంలో ఎడ్వర్డ్ పేట గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ లక్ష్మి గణపతి స్వామి వారి కీర్తింబ ఆలయ పరిహార దేవతా విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం అత్యంత వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ ఆలయ ప్రతిష్ఠ, పరిహార దేవత విగ్రహాల, ధ్వజ స్తంభం ప్రతిష్ఠా మహోత్సవం ఘనంగా జరిగింది. నరసరావుపేట శాసనసభ్యులు డా.గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆలయాన్ని సందర్శించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జడ్పీటీసీ పిల్లి ఓబుల్ రెడ్డి, గ్రామ సర్పంచ్ జిడ్డు యర్రయ్య, మాజీ సర్పంచ్ కోడూరి వెంకటేశ్వరరెడ్డి, వైసిపి మండల నాయకులు కురుగంటి శ్రీనివాసరెడ్డి, అన్నెం పున్నారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించిన బ్రహ్మ రెడ్డి

విశాలాంధ్ర-మాచర్ల: పట్టణంలోని సొసైటీ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ నియోజకవర్గం ఇన్చార్జ్ జూలకంటి బ్రహ్మ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపి పాలనలో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. ప్రజలు సుభిక్షంగా లేరన్నారు. అభివృద్ధి, సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమన్నారు. అవినీతిని ప్రశ్నించిన టీడీపి నాయకుల, కార్యకర్తలపై కేసులు పెట్టడం దుర్మార్గ మన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపిని గెలిపించుకునేందుకు ప్రతి కార్యకర్త సైనికుల్లా పోరాడాలన్నారు. కార్యక్రమంలో కొమెర దుర్గారావు, కుర్రి శివారెడ్డి, సాతులూరి కుమార్, నేరేటి వీరస్వామి, పఠాన్ బాబు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మహానాయకుడు కొణిజేటి రోశయ్య: మంత్రి

విశాలాంధ్ర-తెనాలి: తెనాలికి చెందిన కొణిజేటి రోశయ్య రాష్ట్ర రాజకీయాలలో మహానాయకుడిగా చిరస్థాయిగా నిలిచిపోతారని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున కొనియాడారు. రాజకీయ దిగ్గజం, అజాత శత్రువు, మాజీ ముఖ్యమంత్రి, మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహ విష్కరణ ఆదివారం తెనాలిలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సహా వివిధ పార్టీల నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. తెనాలి బోసురోడ్డులోని జిలేబికొట్ల బజారు కలిసే ప్రదేశంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన మండపంలో ప్రతిష్ఠించిన కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహాన్ని ఉదయం 7 గంటలకు మంత్రి మేరుగ నాగార్జున, రోశయ్య కుమారుడు కొణిజేటి శివ సుబ్బారావు, స్థానిక ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆవిష్కరించారు. రోశయ్య విగ్రహానికి అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున మాట్లాడుతూ... దేశ రాజకీయాలలో పెట్టని కోటలా ఎదిగిన రోశయ్య రాజకీయ జీవితం స్ఫూరిదాయకమని చెప్పారు. శ్రీ వాసవీ ఆలయ సత్రం కమిటీ దాతల సహకారం, ఎమ్మెల్యే శివకుమార్ వెన్నుదన్నుగా రోశయ్య కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ... వివిధ శాఖలకు మంత్రిత్వ, రాష్ట్ర ముఖ్యమంత్రి, గవర్నర్ సహా ఎన్నో ఉన్నత పదవులు చేపట్టిన రోశయ్యపై గల అభిమానంతో ఆయన విగ్రహం ఏర్పాటు చేసుకుని "రోశయ్య మార్గ్"గా నామకరణం చేయడం జరిగిందన్నారు. రోశయ్య కుమారుడు శివ సుబ్బారావు, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం కమిటీ అధ్యక్షుడు, విగ్రహ మండప దాత నూకల వెంకట వేణుగోపాలరావు, మహాత్మా సేవాశాంతి ఆశ్రమం వజ్రాల రామలింగాచారి మాట్లాడారు. విగ్రహదాత, ప్రముఖ వ్యాపారవేత్త నంబూరు వెంకట కృష్ణమూర్తి, డబుల్‌హార్స్ మినపగుళ్ళ అధినేత మునగాల మోహన్ శ్యామ్‌ప్రసాద్, శశిగ్రూప్స్ అధినేత ఉప్పల వరదరాజులు, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ కలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, సత్రం కమిటి కార్యదర్శి బూర్లే నరసింహారావు, ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు సాదు ప్రతాప్, భాస్కరుని శ్రీనివాసరావు, మద్దాలి శేషాచలం, రావూరి సుబ్బారావు, గుండా పిచ్చయ్య, మద్ది మల్లిఖార్జునరావు, చుండూరు సాయి, కాంగ్రెస్ నేతలు డాక్టర్ చందు సాంబశివుడు, పొన్నూరు నాగసూర్య శశిధరరావు తదితరులు పాల్గొన్నారు. విగ్రహశిల్పి కాటూరి వెంకటేశ్వరరావును ఈ సందర్భంగా సత్కరించారు.

దంతాల పరిశుభ్రతతో ఆరోగ్యం

విశాలాంధ్ర-క్రోసూరు : దంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శరీరాన్ని పొందవచ్చని డాక్టర్ పోసాని ప్రసన్నకుమార్ అన్నారు. సోమవారం నుంచి సత్తనపల్లిలోని రవితేజస్వి దంత వైద్యశా లలో అందరికీ ప్రత్యేక వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయని దంతాలను అమర్చడము, అప్పటికప్పుడే ఎక్సరే ద్వారా ఒకే సిట్టింగ్‌లో రూట్ కెనాల్ చికిత్స, ఎత్తు, వంకర పళ్ళు సరిచేయడం కోసం అత్యాధునికమైన పద్ధతిలో క్లిప్స్ ట్రీట్మెంట్ అందుబాటులోకి రానుందని డాక్టర్ పోసాని ప్రసన్నకుమార్ తెలియజేశారు. సోమవారం నుంచి 'ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీమ్'(ప్రభుత్వం ద్వారా ఏ ఖర్చు లేకుండా ఉద్యోగులకు దంతాలకు సంబంధించి అన్ని రకాల సేవలు) ప్రారంభించబడుతుందని ప్రతిఒక్క ఉద్యోగి కూడా ఈ సేవలను ఉపయోగించు కోవాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ వారి 'హెల్త్ కార్డు' గల ప్రతి ఒక్క విలేకరికి వైద్యము చేయబడుతుందని అదేవిధంగా సామాన్య ప్రజలకు 'అత్యాధునిక సేవలు' అందుబాటులో నికి రానున్నాయని తెలిపారు. యువతకు సమస్యగా ఉన్నటువంటి పంటి వరసలు సరిచేస్తూ 'స్మైల్ డిజైనింగ్' చేయడం ద్వారా చాలా సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఈ సదుపాయాన్ని పరిసర మండలాలైన క్రోసూరు, అచ్చంపేట ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

పదవ తరగతి విద్యార్థికి అభినందనలు

విశాలాంధ్ర-మాచవరం : మండల కేంద్రమైన మాచవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థిని షేక్ జాస్మిన్ పాఠశాలలో ప్రథమ స్థానం దక్కించుకోవడంతో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు జాస్మిన్‌ను అభినందించారు. ఈ సందర్భంగా జాస్మిన్ తండ్రి జిలాని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్యను అందించినందుకు పాఠశాల ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

మాజీ ముఖ్యమంత్రి సంజీవయ్య వర్ధంతి

విశాలాంధ్ర-చిలకలూరిపేట : పలు పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 51 వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వీసీకే పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి వంజా ముత్తయ్య కార్యక్రమం నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలిండియా రాహుల్ సేన అధ్యక్షుడు సలాం, జన క్రాంతి పార్టీ అధ్యక్షుడు షేక్ గౌస్, పి.శరత్ తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో ఆదివారం జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆ సంస్థ సలహాదారులు మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ దాసరి చిట్టిబాబు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో అధికార భాష సంఘం రాష్ట్ర సభ్యులు డాక్టర్ కత్తి వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఎం.రాధాకృష్ణ, గేరా యాకోబు, పోనుగుబాటి బుల్లిబాబు, బొల్లాపల్లి బాబూరావు, జెర్రిపోతు బుల్లిబాబు, సాహితీ విమర్శకులు డాక్టర్ పీవీ సుబ్బారావు, చుక్కా విన్సెంట్ పాల్, దార కొండయ్య, దార్ల బుజ్జిబాబు, గ్రంథాలయ ఇంచార్జ్ అధికారి నాగుల్ మీరా వలి పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై కలెక్టర్ సమీక్ష

విశాలాంధ్ర-నరసరావుపేట: జిల్లాలో ప్రభుత్వ సహకారంతో పేద, మధ్య తరగతి వర్గాలకు నిర్మిస్తున్న టిడ్కో గృహాల నిర్మాణ పనులపై జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. టిడ్కో పనుల పురోగతిపై ఆరా తీశారు. గృహ నిర్మాణ శాఖ పనుల్లో తలెత్తుతున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. వివిధ నియోజకవర్గ పరిధిలో గృహ నిర్మాణాల పరిస్థితిని జిల్లా అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు పూర్తి చేసిన ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన లబ్ధిదారులకు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. నిర్మాణాలు కొనసాగుతున్న ప్రాంతాల్లో నిధులు, ఏజెన్సీలు పరిస్థితులను బట్టి త్వరిత గతిన పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గృహ నిర్మాణ పథకాలకు సంబంధించి గుత్తేదారులతో సమస్యలు ఉన్నచోట స్థానిక ప్రజా ప్రతినిధులు శాసన సభ్యులతో చర్చించి పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. నిరంతర పర్యవేక్షణ ఉంచాలని సూచించారు. సమావేశంలో మూడు జిల్లాల టిడ్కో గృహ నిర్మాణ శాఖ ఇ.ఇ. ఏరా ప్రసాదరావు, డీఆర్వో వినాయకం, గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వేణుగోపాలరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-నరసరావుపేట: పదవ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు ఉన్నత చదువులు కోసం రిటైర్డ్ ఐ.ఎఫ్.ఎస్. అధికారి జూపూడి ప్రసాద్ రూ.1లక్ష ఆర్థిక సాయం చేశారు. ఆదివారం జిల్లా కలెక్టర్ శివశంకర్‌ను కలసి చెక్కును అందజే శారు. నవోదయంలో విద్య, ఉద్యోగ, ఉపాధి, వ్యాపార, యువ సాధికా రిత కార్యక్రమాలను రూపొందించి, అందుకు అనుగుణంగా ఆయా సామాజిక వర్గాల అభ్యున్నతికి కలెక్టర్ చేస్తున్న కృషిని ప్రసాద్ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్ కుటుంబ సభ్యులు ప్రకాష్, నాగమ్మ, డేవిడ్ ఉన్నారు.

పది ఫలితాల్లో గీతమ్స్ ప్రభంజనం

విశాలాంధ్ర-వినుకొండ: పది పరీక్ష ఫలితాలలో గీతమ్స్ విద్యార్థులు మార్కుల సునామీ సృష్టించినట్లు పాఠశాల సెక్రటరీ కరస్పాండెంట్ యం.కోటిరెడ్డి తెలిపారు. టి. మారుతి మల్లిక 600 మార్కులకు గాను 594 మార్కులతో రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంకు, జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు అలాగే నియోజకవర్గ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఇదేవిధంగా డి స్వాతి 589, ఎస్.రమ్య 589 ,టి.మైథిలి 584 , డి.నవ్య 583 , ఏ. తిరుమల 583, జె.జానకి 582 , బి.రమాతేజశ్వి 582, యస్. శివ కోటేశ్వరి 582, వి.పుష్పమిత్ర 580 మార్కులతో పట్టణంలోనే అత్యధిక మార్కులు సాధించారు. ఈ సందర్భంగా స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు విద్యార్థిని, విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీకో ఆప్షన్ సభ్యులు గుండాల స్వెనోమ్, మేడం జయరామిరెడ్డి, కరస్పాండెంట్ ఎం. కోటిరెడ్డి, డైరెక్టర్లు సిహెచ్.నారాయణ , కే.రమేష్ , పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నార్ను

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర-మాచర్ల: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టం జరిగిన రైతులను గుర్తించి వారికి వెంటనే ఆర్థిక సాయం అందించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్చార్జి డాక్టర్ వై రామచంద్ర రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల దాటికి మిర్చి, పత్తి, వరి పంటలు పూర్తిస్థాయిలో దెబ్బతిన్నాయన్నారు. యుద్ధ ప్రాతిపదికన వ్యవసాయ అధికారులు నష్టపోయిన రైతులను గుర్తించి వారికి ప్రభుత్వం నుండి తక్షణ సహాయం అందించేలా అధికారులు కృషి చేయాలన్నారు. రైతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్యాలయాల ముట్టడికైనా తాము సిద్ధంగా ఉన్నామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో జివి సత్యనారాయణ, పెండం శ్రీనివాసరావు, వంగపాటి నాగరాజు, షేక్ బాబు పాల్గొన్నారు.

పంటల పరిస్థితిపై ఆరా

విశాలాంధ్ర-వినుకొండ: పంటల పరిస్థితిపై రైతులతో మండల తాసిల్దార్ బి. కిరణ్ కుమార్. మండల వ్యవసాయ అధికారి కే .అంజి రెడ్డి మండలంలోని నరగాయపాలెం, పెదకంచెర్ల ,ఎనుగుపాలెం గ్రామ రైతులతో వర్షాలకు పంటలు పరిస్థితులు గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పంట నష్టం జరిగితే రైతు భరోసా కేంద్రాల ద్వారా తెలియజేయాలని కోరారు. ధాన్యం క్వింటాల్కు గ్రేడ్ ఏ రకం 2060 రూపాయలు, సాధారణ రకం 2040 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని తెలియజశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ రైతులు, రెవెన్యూ. మండల వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర-పెదకూరపాడు : అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని వ్యవసాయ అధికారులు వెంటనే పంట నష్టాన్ని అంచనావేసి రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని పెదకూరపాడు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు కొమ్మాలపాటి శ్రీధర్, టీడీపీ నాయకులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండల పరిధిలోని పాడపాడు, లింగంగుంట్ల, పెదకూరపాడు గ్రామాలలో ఆదివారం వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ వర్షానికి దెబ్బతిన్నప్పటికీ రూ.8 వేలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తేనే రైతులు మళ్లీ సాగులోకి వస్తారన్నారు. రైతులను ఆదుకోవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆర్తిమలా రమష్, భాష్యం ఆంజనేయులు, బెల్లంకొండ రామ్‌గోపాల్ రావు పాల్గొన్నారు.

మహారాజశ్రీ గురజాల సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.83/22 ఇన్ ఓ.యస్. 316/2014

బిట్వీన్ :

మనేపల్లి నాగమణి మరియు వగైరాలు -పిటిషనర్సు/ వాదులు

వర్సెస్

జక్కా సుబ్బమ్మ మరియు వగైరాలు - రెస్పాండెంట్సు/ ప్రతివాదులు

8వ రెస్పాండెంట్ : చావా నాగలక్ష్మి భర్త అప్పారావు, 4వ లైను సీతారామనగర్ గుంటూరు (మం) జిల్లా.

పై నెంబరు దావాను ప్రతివాదులు పై పార్టిషన్ పొందు నిమిత్తము దాఖలు చేయగా సదరు దావాలో 5వ ప్రతివాది చనిపోయినందున వారి స్థానే వారసులుగా చేర్చగా 8వ రెస్పాండెంటునకు నోటీసులు నిమిత్తము కోర్టు వారు డి.11-05-2023 వ తేదీనకు వాయిదా వేసినారు. సదరు వాయిదా రోజు ఉదయం 10.30ని॥లకు స్వయముగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలసి యున్నది లేనిచో పరోక్షమందు తీర్మానించబడును.

అచంట శ్రీనివాసరావు
వాదితరపు అడ్వకేట్, గురజాల
సెల్ : 9849031191

మహారాజశ్రీ మాచర్ల ఎడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

C.C NO : 66/2014

బిట్వీన్,

లట్టుపల్లి వెంకట గురువులు - ఫిర్యాది.

వర్సెస్,

బొంకూరి నాగేశ్వరరావు - ముద్దాయి.

టు,

బొంకూరి నాగేశ్వరరావు తండ్రి ఆంజనేయులు, హిందూ, 38 సంవత్సరములు, వ్యాపారం, R/o. 4 వ ఫ్లోర్, 4/2, అరండల్ పేట, జగన్ మోహన్ రావు, కాంప్లెక్స్, కాఫీ విత్తనాల బిల్డింగ్ ఎదురు గుంటూరు.

పైన తెలిపిన కేసులో శ్రీ కోర్టు వారు మీకు సమన్లు నిమిత్తము అర్డరు వేయగా, మీకు ఎన్ని పర్యాయములు సమన్లు నిమిత్తం బత్తా చెల్లించినను, మీరు సమన్లు తీసుకొని యుండలేదు. మీకు సమన్లు నిమిత్తము డి. 10-05-2023 కు వాయిదా అయిఉన్నది. కావున మీరు డి. 10-05-2023న ఉదయం 10:30 గంటలకు హైకోర్టు వారి ఎదుట హాజరై మీకు ఏమైనా ఆక్షేపణలు యున్న యెడల తెలుపుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు పైన తెలుపబడిన కేసు తీర్మానము చేయబడును.

వాయిదా : 10-05-2023.

చిలమకూరి నాగిరెడ్డి, బి.కాం, బి.ఎల్
అందుకుల బాలజోజి, M.A,B.L
ఫిర్యాదు తరఫున న్యాయవాదులు
మాచర్ల - 522426.
సెల్ : 9441129568, 9866499323.

కంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-అద్దంకి : కంటి సమస్యలు ఉన్న వారు వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స తీసుకోవాలని రోటరీ క్లబ్ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో, పట్టణ వైసీపీ అధ్యక్షులు కాకాని రాధాకృష్ణ మూర్తి సౌజన్యంతో ఆదివారం ప్రకాశం బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శంకర నేత్రాలయం వైద్యులు 300మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో 170 మందికి శుక్లం ఆపరేషన్లు అవసరం అయినందున ఈనెల 11న పెదకాకాని శంకర కంటి ఆసుపత్రిలో శస్త్ర చికిత్సలు చేస్తారని, వారికి ఉచిత ప్రయాణ వసతి కల్పిస్తారని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు రుద్రయ్య, జ్యోతి చంద్రమౌళి, నర్రా శ్రీలక్ష్మి, చెన్నుపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకల్లో కృష్ణచైతన్య

విశాలాంధ్ర-అద్దంకి : పోతురాజుగండిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు కంచరగుంట సాంబశివరావు కుమార్తె రేఖ ప్రసన్న వివాహం ఆదివారం జరగగా శాప్‌నెట్ చైర్మన్ బాచిన కృష్ణచైతన్య హాజరై నూతన వధూవరులు రేఖ ప్రసన్న, శశికుమార్‌లను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు.

తెలుగుభాష విద్యార్థులే కాపాడుకోవాలి

విశాలాంధ్ర-అద్దంకి: తెలుగుభాష అంతరించిపోతున్న తరుణంలో దాన్ని కాపాడుకోవల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని సృజన సాహితీ సంస్థ అధ్యక్షులు గాడేపల్లి దివాకరదత్తు అన్నారు. ఎన్టీఆర్ డిగ్రీ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరుగుతున్న విద్యార్థులకు వేసవి తరగతులకు ఆదివారం దివాకరదత్తు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పండరంగని పద్యశాసనం అద్దంకి గడ్డమీదనే పుట్టిందని, తెలుగుభాష ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో జెవివి అధ్యక్షులు తంగా శ్రీనివాసరావు, సృజన కార్యదర్శి అనిల్‌కుమారసూరి, హెూమియో వైద్యులు కాపూరి రఘుచంద్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

విశాలాంధ్ర - వేమూరు : మండలంలోని చావాలి గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఈపూరి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ బీమా పది వేల చెక్కును పీఏసీఎస్ అధ్యక్షులు గాజుల భాను ప్రకాష్ అందజేశారు. మృతుడు భార్య ఈపూరి వెంకటేశ్వరమ్మకు చెక్కు అందించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతోపాటు సచివాలయ సిబ్బంది, వైసీపీ నాయకులు సోమరౌతు పాండురంగారావు తదితరులున్నారు.

వీరాంజనేయ స్వామికి విశేష అర్చనలు

విశాలాంధ్ర - వేమూరు : మండలంలోని జంపని గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానంలో నిర్వహిస్తున్న వార్షిక హనుమజ్జయంతోత్సవాలలో భాగంగా స్వామివారికి నిత్యం విశేష పూజారి కైంకర్యాదులు నిర్వహిస్తున్నారు. ఆదివారం వేములపల్లి శివరామకృష్ణ నాదెండ్ల సురేష్ బాబు దంపతులు స్వామికి పట్టు వస్త్రాల సమర్పించి నాగవల్లి పత్రాలు గులాబీ పుష్పాలతో అర్చన జరిపించారు. పల్లకి ఉత్సవం నిర్వహించారు. వీరాంజనేయ స్వామి భక్తి సమాజం వారు భజన కీర్తనలు ఆలపించారు భక్తుల విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

పంట నష్టం రైతులకు ప్రభుత్వం అండ

విశాలాంధ్ర - నిజాంపట్నం : పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని తహశీల్దార్ ఎం.శిరీష, మండల వ్యవసాయధికారి వాగోలు బుష్ తెలియజేశారు. మండలంలోని పలపట్ల, కూచినపూడి గ్రామాల్లో అకాల వర్షం కారణంగా పంట నష్టం జరిగిన మొక్కజొన్న, వేరుశెనగ పంట పొలాలను ఆదివారం వారు పరిశీలించి రైతులతో మాట్లాడారు. రైతులు అధైర్య పడవద్దని, పంట నష్టం జరిగిన రైతులకు ప్రభుత్వం పంట నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు రంగు మారిన మొలకెత్తిన పంటను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని చెప్పారు. మొక్కజొన్న రైతులు రైతు భరోసా కేంద్రాల్లో వీఏఏ ద్వారా తమ పంటను నమోదు చేసుకోవాలని సూచించారు. వారి వెంట ఏఈఓ వంశీ, వీఆర్వో మోపిదేవి వేణు, రైతులు తదితరులు ఉన్నారు.

ఆటల్లో రాణించి పేరు తెచ్చుకోవాలి

విశాలాంధ్ర - నగరం : చదువుతో పాటు ఆటల్లో రాణించాలని శ్రీవెలగపూడి రామకృష్ణ కళాశాల ప్రిన్సిపల్ అనగాని హరికృష్ణ తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత నెల 26వ తేదీన జరిగిన రాష్ట్రస్థాయి అథిలెటిక్స్ పోటీల్లో కళాశాలకు చెందిన బొర్రా తేజస్విని 20 కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో ద్వితీయ స్థానం దక్కించుకుంది. విద్యార్థినిని కళాశాలల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.

శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - నగరం : వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా రాష్ట్ర గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మంత్రిపాలెం గ్రంథాలయ నిర్వాహకుడు జొన్న బ్రహ్మేంద్ర తెలిపారు. ఈ శిబిరంలో కథలు, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, పెద్దల నుంచి విన్న అముద్రిత కథలు చెప్పడం, చిత్ర లేఖనం పేపర్ ఆర్ట్, థియేటర్ ఆర్ట్ వంటి అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. మంత్రిపాలెం గ్రంథాలయంలో మే 8 నుంచి 11వ తేదీ వరకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు.

రహదారుల నాణ్యత పరిశీలన

విశాలాంధ్ర - అమృతలూరు : మండలంలోని పెదపూడిలో ఇటీవల నిర్మించిన నాలుగు పక్కా రహదారులను విజిలెన్స్, క్వాలిటీ కంట్రోల్ అధికారుల బృందం సోమవారం పరిశీలించారు. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్ర మంలో సమస్యను గుర్తించి రూ.15 లక్షలతో రహదారులను నిర్మించారు. వీటి నాణ్యతను పరిశీలించిన అధికారులు నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. పంచాయతీరాజ్ శాఖ ఏఈ మదన్మోహనరావు, సర్పంచి ఆనందబాబు తదితరులు వారి వెంట ఉన్నారు.

బాబాకు వెండి ఆభరణాల బహూకరణ

విశాలాంధ్ర - చినగంజాం : స్థానిక హనుమత్ సాయి మంది రంలోని దత్తాత్రేయుడు. ఆంజనేయస్వామికి రూ.50 వేల విలువైన వెండి కవచాలను బాపట్లకు చెందిన దాతలు గాను గపాటి నరసింహారావు, ద్వారకాకుమారి దంపతులు సోమవారం అర్చకుడు మాజేటి లక్ష్మీ ప్రసాద్కు అందజేశారు. వాటిని దేవేరులకు అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ సేవాదళ్ సభ్యులు ఆంజనేయులు, ప్రభాకర రావు, పుల్లమ్మ, పార్వతి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య

విశాలాంధ్ర - కారంచేడు : సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నారని మండలంలో ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు పాఠశాలలో అందిస్తున్న విద్య, ప్రభుత్వం అందిస్తున్న సహకారంపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పిం చారు. ఉపాధ్యాయ బృందం గ్రామంలోని 5వ తరగతి పూర్తి చేసుకొని 6వ తరగతిలో చేర్పించే విద్యార్థుల జాబితా తీసుకొని వారి గృహాలకు వెళ్లి మన ఊరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోనే అందుతున్న సదుపాయలను వివరించారు.

అగ్రహార భూములకు పట్టాదారు పాసుపుస్తకాల మంజూరు ఎప్పుడో..

విశాలాంధ్ర - సంతమాగులూరు : మండలంలోని కొమ్మలపాడు మక్కినవారిపాలెం గ్రామంలో తాత ముత్తాతల తరాల నుండి సాగు చేసుకుంటున్న భూములకు ఇంతవరకు పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు కాలేదు. పాలకులు మాత్రం ఎన్నికల ముందు బహిరంగ సభల్లో హామీలు అయితే ఇస్తున్నారు గాని వాటిని నెరవేర్చిన పాపానపోలేదు. కొమ్మలపాడు మక్కినవారిపాలెం ఈ రెండు గ్రామాలే ఈ రెండు గ్రామాల్లో 4,500 ఎకరాలకు ప్రభుత్వం నుండి లభించే లబ్ధి గాని బ్యాంకు రుణాలు మంజూరు కావడం లేదు. అంతేకాకుండా ఇక్కడి రైతాంగానికి పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడంతో డ్రిప్పు పరికరాలు ఇవ్వడానికి ప్రభుత్వ అధికారులు నిబంధనలతో సతమతమవుతున్నారు. కావున ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చుక్కల భూములు సాగు చేసుకుంటున్న భూములకు సర్వే చేసి పట్టాదారు పాస్ పుస్తకాలు మంజూరు చేయాలని చెబుతున్నప్పటికీ ఇక్కడి రెవెన్యూ అధికారులు సర్వే అధికారులు ఇటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడంతో రైతాంగంలో ప్రధాన చర్చ కేవలం ముస్లిం మైనార్టీల బలహీన వర్గంఅవటంవల్ల చిన్న చూపు ధోరణి అని చర్చమొదలైంది. దీనిపై స్థానిక ప్రభుత్వ నాయకత్వం దృష్టి సారించకపోతే రైతాంగంలో తీవ్ర విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించుకుంటారని వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. వెంటనే దీనిపై స్థానిక ప్రభుత్వ నాయకత్వం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లి ఈ రెండు గ్రామాల రైతాంగం యొక్క ప్రధాన సమస్యల అగ్రహర భూముల పట్టాదారుపాస్ పుస్తకాలు మంజూరు చేసే విధంగా కృషి చేయాలని ఎన్నికల ముందు ఇచ్చిన హామీ నెరవేర్చాలని ఇక్కడి రైతాంగం కోరుతున్నారు.

ఘనంగా సంజీవయ్య వర్ధంతి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య వర్ధంతి సందర్భంగా బాపట్ల స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో గల అంబేద్కర్ మార్గ్ వద్ద దళిత బహుజన నాయకుల ఆధ్వర్యంలో ఏ.ఎస్.పీ.ఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు చార్వాక, మాల మహానాడు రాష్ట్ర అధికార ప్రతినిధి శీలం రోజన్ బాబు దామోదరం సంజీవయ్య చిత్రపటానికి ఘన నివాళులు అర్పించారు. అనంతరం చార్వాక మాట్లాడుతూ ప్రజల కష్టాలను ఎరిగి ప్రజల నుంచి పుట్టిన నాయకులు సొంత లాభం కంటే ప్రజా సంక్షేమమే ఎక్కువగా చూస్తారు అనడానికి దామోదర సంజీవయ్య జీవితమే ఒక గొప్ప నిదర్శనమన్నారు దామోదర సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్న రోజుల్లోనే వృద్ధాప్యంలో ఉన్న తల్లి తండ్రులకి దేశంలో మొట్ట మొదటిసారిగా వృద్ధాప్య పింఛన్ పథకాన్ని అమలు చేశారని అన్నారు. సంజీవయ్య ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలోనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాలకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించి ఉద్యోగాలతో పాటు ప్రమోషన్లలో కూడా రిజర్వేషన్లు అమలు అయ్యేలా 1961లో ఉత్తర్వులు తయారు చేశారన్నారు. శ్రీకాకుళం జిల్లాలో వంశధార సువర్ణముఖి, నాగావళి, వేదవతి, నదీ జలాల, సాగు నీరు నుండి రైతులు పొలాల్లో పండిచే పంటలు బాగా పండుతున్నాయి అంటే అది దామోదరం సంజీవయ్య కృషి అని ఎంతో ఉంది అన్నారు. రాబోయే రోజులలో దామోదరం సంజీవయ్య విగ్రహం బాపట్లలో స్థాపింప చేయడానికి తనవంతుగా కృషి చేస్తానని తెలియజేశారు. బహుజన్ సమాజ్ పార్టీ నాయకుడు వినయ్ రాజు, సమతా సైనిక్ దళ్ అధ్యక్షుడు శ్రీకర్, గుదే రాజారావు, జన సేన గొట్టిపాటి శ్రీకృష్ణ, విసికె పార్టీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సంజీవయ్యకు కాంగ్రెస్ నేతల ఘన నివాళి

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 52వ వర్ధంతి సందర్భంగా జిల్లా అధ్యక్షులు గంటా అంజిబాబు సంజవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంజిబాబు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక అభివృద్ధి కోసం ఐటిపిఎల్, బీహెచ్ఈఎల్ వంటి కంపెనీలతో పాటు వ్యవసాయ అభివృద్ధి కోసం ఆయన ఎనలేని కృషి చేశారన్నారు. జిల్లా ముస్లిం మైనార్టీ నాయకులు పటాన్ రాజేష్ మాట్లాడుతూ గాజులదిన్నె, వంశధార ప్రాజెక్టులను నిర్మించి నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు ఆనాటి బడ్జెట్లో 77 కోట్ల రూపాయలు కేటాయించిన ఘనత దామోదరం సంజీవయ్యకే దక్కుతుంది అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ శీలం సాగర్, మాజీ కౌన్సిలర్ రాంబాబు, శంకర్ రెడ్డి, డి రవి, మహిళా పట్టణ అధ్యక్షురాలు దండు రేణుక, కోన జయశాంతి తాజుద్దీన్, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంటను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని అంబడిపూడి, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం, వైదన గ్రామాలలో ఆదివారం మొక్కజొన్న పొలాలను మరియు కోసి కలాలలో పోసిన మొక్కజొన్న విత్తనాలను మండల వ్యవసాయ అధికారి ఎస్విపి కుమారి రైతులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షం కారణంగా పొలాలలో నీరు నిలిచి పంట నష్టపోయిన పరిస్థితి లేదన్నారు. కళ్ళలలో కుప్పగా ఉన్న మొక్కజొన్న విత్తనాలలో తేమ శాతం అధికంగా ఉందని తద్వారా ఫంగస్ వచ్చి గింజ నాణ్యత దెబ్బ తింటుందని రైతులందరూ వాతావరణం పొడిగా ఉన్నందున గింజలను పలుచగా ఆరబోసుకోవాలని రైతులకు సూచించారు. మరో రెండు రోజులపాటు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ సూచించడంతో రైతులందరూ అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం మార్క్ ఫైడ్ ద్వారా రైతులు పండించిన మొక్కజొన్నలు కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించినట్లు తెలిపారు. ఈనెల 10వ తేదీలోగా రైతులు తమ పంట వివరాలను తెలియజేయాలన్నారు. రైతులు దళారుల మాటలు నమ్మి తక్కువ ధరకు మొక్కజొన్న విత్తనాలను అమ్ముకోవద్దని రైతులకు సూచించారు.

వేసవి యోగా శిక్షణ శిబిరాన్ని వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : చెరుకుపల్లిలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో వేసవి సెలవుల దృష్ట్యా చిన్నారుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు బాలలకు వేసవి యోగా శిక్షణా తరగతులను ప్రారంభిస్తున్నామని సీనియర్ యోగా గురు వులు కె రోశయ్య తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ నేటి నుంచి 25వ తేదీ వరకు ఉదయం 6 నుంచి 7 గంటల వరకు 16 సంవత్సరాలలోపు బాలబాలికలకు తరగతులు నిర్వహిస్తామన్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు బాలబాలికలకు భగవద్గీతపై శిక్షణ చిలుకోటి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉంటుందన్నారు.

శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవం

విశాలాంధ్ర - నగరం : శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం ఆదివారం పలు గ్రామాల్లోని స్వామివారి దేవాలయాల్లో ఆదివారం భక్తులు సంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. ఉదయం మేళ తాళాలతో స్వామి వారి చిత్రపటానికి జెండాను, గ్రామ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. దేవాలయాల వద్ద సంస్కృతిక కార్యక్రమాలు, భజనలు నిర్వహించారు.

సత్యసాయి ఆశీస్సులతో చెస్ టోర్నమెంట్

విశాలాంధ్ర - చీరాల : చీరాల కొట్లబజారులోని శ్రీ సత్యసాయి భజన మండలిలో చెస్ అకాడమీ వారు చిన్నారులకు చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్లో 32 బోర్డులలో చిన్నారులు పాల్గొన్నారు. మెత్తం ఐదు దశలలో ఫిల్టర్ చేసి విజేతలను ప్రకటిస్తారు. ఈ టోర్నమెంట్లో ఎంతో ఉత్సాహంగా 65 మంది చిన్నారులు హాజరు అయ్యారు.

రైతు కష్టంపై కనికరం లేని వరుణుడు

విశాలాంధ్ర - చినగంజాం : రైతు ఆరుగాలం కష్టంపై వరుణుడికి కనికరం లేకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అకాల వర్షాలు రైతులను వెన్నాడుతూనే ఉన్నాయి. వర్షాలతో జొన్న, మొక్కజొన్న, పసుపు పంట ఉత్పత్తులు రోజు రోజుకు దెబ్బతిని నాణ్యతను కోల్పోతున్నాయి. పొలాల్లో, కల్లాల్లో జొన్న, మొక్క జొన్న పంట ఉత్పత్తుల్లు తడిసిపోయాయి. రైతులు వాటిని కాపాడుకునేందుకు ప్లాస్టిక్ పట్టాలు ఉపయోగించిన ప్రయోజనం లేకుండాపోతోంది. ప్రభుత్వం అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు.

మతాల మధ్య చిచ్చుతో రాజకీయ లబ్ధి

విశాలాంధ్ర - నగరం : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నదని వామపక్ష నాయకుడు మణిలాల్ ఆరోపించారు. మోదీ ప్రజా వ్యతిరేక విధానా లని నిరసిస్తూ ఆదివారం నగరంలో ప్రచారం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు.

అల్లూరి విగ్రహావిష్కరణలో ఆర్మీ విజయ్

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : పట్టణంలోని సూర్యలంక బీచ్ రోడ్డులో క్షత్రియ సేవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణ ప్రముఖ పారిశ్రామిక వేత్త ఆర్మీ విజయ్ పాల్గొని అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్మీ విజయ్ మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్య పోరాటంలో అలుపెరుగని పోరాటం జరిపి చిన్న వయసులోనే దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప మహనీయులు అల్లూరి సీతారామరాజు అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆయుధాలు చేపట్టి బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ అడవులలో గెరిల్లా యుద్ధానికి నాయకత్వం వహించి వారిని తరిమి కొట్టారన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా 19వ శతాబ్దం ప్రారంభంలో అలుపెరుగని పోరాటం జరిపి మన్యం ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని గుర్తు చేశారు. మన్యం యువతకు నాయకత్వం వహిస్తూ సైనిక వ్యూహాలు అమలు చేస్తూ పెద్ద ఎత్తున గిరిజన బిడ్డలను సైనికులు గా తీర్చిదిద్ది స్వాతంత్ర్య సంగ్రామంలో వారిని భాగస్వామ్యులను చేశారు.

ఆర్బీకేను ప్రారంభించిన ఎమ్మెల్యే కోన

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : ఈస్ట్ బాపట్ల గ్రామ పంచాయతీలోని నందిరాజు తోటలో రైతుభరోసా కేంద్రంను ఎమ్మెల్యే కోన రఘుపతి ఆదివారం ప్రారంభించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తామనే విషయాన్ని రైతులు ప్రచారం చేయాలన్నారు. పంట నష్టంపై యుద్ధ ప్రాతిపదికన సర్వేలు నిర్వహించి నివేదిక అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సచివాలయ సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆకాల వర్షంతో రైతు కన్నీరు

విశాలాంధ్ర - కారంచేడు : అకాల వర్షం దాటికి రైతులు కన్నీరు పెడుతున్నారు. కారు మబ్బులు కమ్ముతుండటంతో దిక్కుతోచని దుస్థితిలో తీరం రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. అకాల వర్షాల నుంచి పంటను రక్షించుకోలేక నూర్పిడి చేసిన పంటను అమ్ముకో లేక కల్లాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

గోవిందనామ సంకీర్తన

విశాలాంధ్ర - వేమూరు : హనుమజ్జయంతి ఉత్సవాల్లో భాగంగా జంపనిలో శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయంలో దాస సాహిత్య ప్రాజెక్టు భజన మండలి సభ్యులు గోవిందనామ సంకీర్తన చేశారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేసి తీర్థప్రసాదాలు అందించారు.

రైతులకు టార్పాలిన్ పట్టాలు అందించాలి

విశాలాంధ్ర - కారంచేడు : వర్షం నుండి పంట ఉత్పత్తులు తడవకుండా కాపాడుకునేందుకు వ్యవసాయ శాఖ టార్పాలిన్ పట్టాలు కూడా రైతులకు అందించటం లేదని సీపీఐ జిల్లా నాయకులు జేబీ శ్రీధర్ తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో వర్షాలకు తడిసిన జొన్న, మొక్కజొన్న పసుపు పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పంటల భీమా పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

శ్రీకోదండ రామాలయ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - నగరం : కూచినపూడి ఎస్టి కాలనీ లో టీటీడీ నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండరామాలయ ప్రతిష్ఠా మహోత్సవానికి ఆదివారరి శరణాగతి గోష్టి పీఠాధిపతులు శ్రీనరేంద్ర రామానుజ స్వామి హాజరైయ్యారు. శేషాచార్యులు హెూమకార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లపాటి రామకృష్ణప్రసాద్, ధర్మప్రచారక్ జంజనం హేమశంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, తదితరులు పర్యవేక్షించారు.

రైతును వెంటాడుతున్న వర్షాలు

విశాలాంధ్ర - కారంచేడు : అకాల వర్షాలు రైతులను వెన్నాడుతూనే ఉన్నాయి. వరుసగా కురుస్తున్న వర్షాలతో జొన్న, మొక్కజొన్న, పసుపు పంట ఉత్పత్తులు రోజు రోజుకు దెబ్బతిని రూపురేఖలతో పాటు నాణ్యతను కోల్పోతున్నాయి. వర్షానికి పొలాల్లో, కల్లాల్లో జొన్న, మొక్క జొన్న పంట ఉత్పత్తులు మళ్లీ తడిసిపోయాయి. రైతులు వాటిని కాపాడుకునేందుకు ప్లాస్టిక్ పట్టాలు ఉపయోగించిన ప్రయోజనం లేకుండా పోతోంది. భారీ వర్షానికి రహదారులు జలమయం కావడంతో పాటు పల్లపు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. ప్రభుత్వం అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంట ఉత్పత్తులను కొను గోలు చేసి తమను ఆదుకోవాలన్నారు.

స్వర్ణలో వెంకయ్య విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - కారంచేడు : మండలంలోని స్వర్ణ గ్రామ అభివృద్ధిలో తనదైన ముద్ర వేసుకున్న నీరుకట్టు వెంకయ్య పాత్రను మరువలేమని ఎంపీపీ నీరు కట్టు వాసుబాబు అన్నారు. గ్రామానికి చెందిన నీరుకట్టు వెంకయ్య విగ్రహావిష్కరణలో పాల్గొని మాట్లాడారు. శ్రీవెంకటేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ అభివృద్ధిలో ఆయన అందించిన సేవలు మరిచి పోలేనివన్నారు. భార్య లలిత, కుమారులు మల్లిఖార్జునరావు,చిట్టిబాబు, కుమార్తెలు సుకన్య, శ్రీలక్ష్మి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాపట్లలో సీతారామరాజు విగ్రహావిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల రూరల్ : బాపట్ల సూర్యలంక రోడ్‌లో బాపట్ల క్షత్రియ సేవా సమితి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన మన్యం వీరుడు విప్లవ జ్యోతి శ్రీ అల్లూరి సీతారామరాజు విగ్రహా ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే కోన రఘుపతి జ్యోతి ప్రజ్వలన చేసి అల్లూరి సీతా రామరాజు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్, మాజీ శాసన సభ్యులు దేవినేని మల్లికార్జున రావు, మాజీ ఎమ్మెల్యే మంతెన అనంత వర్మ, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, టీడీపీ వేగేశన నరేంద్రవర్మ, ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి ఇంటింటికి ప్రచారం

విశాలాంధ్ర - నగరం : ఇంటింటికీ ధర్మ ప్రచార కార్యక్రమాన్ని ఈ నెల 10 నుంచి 25 వరకు నిర్వహిస్తున్నట్లు సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర రావు మంగళవారం తెలిపారు. స్థానిక శ్రీ పద్మావతి సమేత శ్రీనివాసుని దేవాలయంలో మండల ప్రచారక్‌ల సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో యల్లాప్రగడ సీతాపతి, యల్లావుల అంకమ్మరావు, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

విశాలాంధ్ర బాపట్ల జిల్లా

రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

విశాలాంధ్ర - వేమూరు : అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ మెరుగు నాగార్జున తెలియజేశారు. శనివారం మండలంలోని బలిజేపల్లి గ్రామంలో అకాల వర్షాల కారణంగా తడిసిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తడిసిన జొన్న,మొక్కజొన్న పంటలను ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి వర్షాల కారణంగా పంట నష్టపోయిన వివరాలపై ఉన్నతాధికారులతో చర్చించారని అందుకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యల గురించి కూడా వివరించారు. సోమవారం నుంచి నియోజకవర్గంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని రైతులకు వివరించారు. ఆయనతోపాటు మార్కెట్ యార్డ్ చైర్మన్ బోలిముంత ఏడుకొండలు అమతులూరు ఎంపీపీ రాపర్ల నరేంద్ర తదితరులు ఉన్నారు.

యువకుడిని రక్షించిన పోలీసులు

విశాలాంధ్ర బ్యూరో - బాపట్ల : వాడరేవు సముద్ర తీరంలో గల్లంతయిన యువకుడిని మెరైన్ పోలీసులు ప్రాణాలకు తెగించి కాపాడారు. జిల్లా పోలీస్ కార్యాలయం తెలిపిన వివరాల మేరకు పల్నాడు జిల్లా క్రోసూరుకు చెందిన సయ్యద్ రాజావలి అనే యువకుడు విహారయాత్రకు వచ్చి స్నానం చేసేందుకు సముద్రంలో దిగి గల్లంతయ్యాడు. అదే సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఎ.నరేష్ బాబు, హోంగార్డు ఎస్.శ్రీనివాసరావు ధైర్య సాహసాలతో అతన్ని రక్షించి ఒడ్డుకు చేర్చారు. రాజావలి కుటుంబ సభ్యులు స్నేహితులు మాట్లాడుతూ మెరైన్ పోలీసుల రుణం ఎప్పటికీ తీర్చుకోలేమన్నారు. యాత్రికుడి ప్రాణాలు కాపాడడంలో తెగువ చూపించిన మెరైన్ పోలీసులను జిల్లా ఎస్పీ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు. పర్యాటక యాత్ర విషాదయాత్రగా మారకుండా సముద్ర స్నానాలు ఆచరించి క్షేమంగా స్వస్థలాలకు వెళ్లాలని పర్యాటకులకు ఎస్పీ సూచించారు.

చెన్ను మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

విశాలాంధ్ర - నగరం : మండలంలోని ఉల్లిపాలెంలో వేంచేసిన శ్రీ చెన్న కేశవ చెన్ను మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా స్వామికి మంగళస్నానాల అనంతరం విశేషార్చనలు, మహానివేదన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర - అమృతలూరు : మండల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు ఐక్యతతో కృషిచేయాలని ఎంపీపీ నరేంద్రకుమార్ అన్నారు. మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు సమయంలో ఆయా వివరాలను అధికారులు సంబంధిత ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని సూచించారు. ఎంపీడీవో మహబూబుభాని, తహసీల్దారు మెహర్ కుమార్, ఈవోపీఆర్డీ మరియాదేవి, మండల ఉపా ధ్యక్షుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుబంధ యూనిట్లతో అదనపు ఆదాయం

విశాలాంధ్ర - అమృతలూరు : వ్యవసాయాధారిత అనుబంధ యూనిట్లతో అదనపు ఆదాయం సమకూర్చుకోవచ్చని ఏపీఎం రాంబాబు అన్నారు. స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంఘ కార్యాలయంలో సంఘ సభ్యులు, దులు, పిల్లర్ డైరెక్టర్లకు సమీకృత వ్యవసాయంపై నెలకొనడంతో శిక్షణ నిర్వహించారు. ఏపీఎంలు కోడి రామకృష్ణ, లోని గుళ్లప సురేంద్ర, సీసీలు బలరామ్, శిరీష, శ్రీనివాసరావు, రైతు మిత్రలు, వీఓఏలు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

విశాలాంధ్ర - నగరం : రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు నిలిపివేయడంతో దిక్కుతోచని దుస్థితిలో తీరం రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. అకాల వర్షాల నుంచి పంటను రక్షించుకోలేక నూర్పిడి చేసిన పంటను అమ్ముకో లేక కల్లాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్రాల్లో పంటను కొనుగోలు చేసి ఉంటే వర్షాలకు తడవాల్సిన పరిస్థితి వచ్చేది కాదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

అకాల వర్షం కలాల్లో ధాన్యం

విశాలాంధ్ర - అమృతలూరు : అకాల వర్షం దాటికి కలాల్లో ఉన్న ధాన్యం తడిసిపోయింది. దీంతో దిక్కుతోచని దుస్థితిలో తీరం రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పంటను కొనుగోలు చేసి ఉంటే వర్షాలకు తడవాల్సిన పరిస్థితి వచ్చేది కాదని రైతులు వాపోతున్నారు. అకాల వర్షాల నుంచి పంటను రక్షించుకోలేక నూర్పిడి చేసిన పంటను అమ్ముకో లేక కల్లాల్లో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాధికారులు స్పందించి తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

బీజేపీది రెండు నాల్కల ధోరణి

విశాలాంధ్ర - నగరం : బీసీ జన గణనపై భారతీయ జనతా పార్టీ రెండు నాల్కల ధోరణి అవలంబిస్తోందని రాష్ట్ర బీసీ సంఘ అధ్యక్షుడు కేసన శంక రరావు అన్నారు. మండల కేంద్రం నగరంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2021 జనాభా లెక్కల సేకరణ సమయంలో ఓబీసీ కాలం ఏర్పాటు చేసి బీసీ కులాల అభివృద్ధికి కృషి చేస్తామన్న భాజపా నాయకులు ఆ విషయాన్ని మరిచారన్నారు. ప్రతిపక్ష హెూదాలో ఒక మాట అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కులాలవారీ జనగణనకు దేశంలోని 18 రాష్ట్రాలు మద్దతు తెలియచేశాయన్నారు.

ఘనంగా శ్రీరాముల విగ్రహ ప్రతిష్ఠ

విశాలాంధ్ర - నగరం : కూచినపూడి గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానములు శ్రీవాణి ట్రస్ట్ ఆర్థిక నిధులతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తెనాలి శరణాగతి గోష్టి పీఠాధిపతులు నరేంద్ర రామానుజ స్వామి వారు ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు హాజరై ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతిష్ఠా కార్యక్రమాన్ని అగ్నిహెూత్రం శేషాచార్యులు బృందం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం నల్లపాటి శివరామకృష్ణ ప్రసాద్ దంపతులు శాంతి కళ్యాణం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి హరినాథ్ బాబు, రేపల్లె మున్సిపల్ చైర్మన్ కట్టా మంగా, జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, మహిళా కన్వీనర్, బొలగాని విజయలక్ష్మి, లంకా కృష్ణ కుమారి, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు కాలేపల్లి గౌరీ శంకర్, బందారు సుబ్బరాజు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - రేపల్లె : కమ్యూనిటీ హాల్ నిర్మాణం ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ రావు అన్నారు. పట్టణంలోని 13 వ వార్డు వడ్డెర కాలనీ ప్రజల సౌకర్యం కొరకు ఆదివారం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.20 లక్షల ఎంపీ నిధులు, మరో రూ.30 లక్షల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తున్నట్లు చెప్పారు. వార్డు ప్రజల వివాహాది, శుభ కార్యాలకు, ఫంక్షన్ లకు తగిన సౌకర్యాలతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్ చైర్మన్ కట్టా మంగా, కమీషనర్ విజయ సారథి వైసీపీ నాయకులు పాల్గొన్నారు.